
సాక్షి
రాజన్న సిరిసిల్ల
శనివారం । 20 । మే । 2023



భక్తులు లేక వెలవెల
వేములవాడ: శుక్రవారం అమావాస్య కావడంతో రాజన్న దర్శనానికి భక్తులు రాలేరు. సెలవులు దగ్గర పడుతున్నా భక్తులు లేక ఆలయం వెలవెలబోయింది.



జీవనదిలా వరదకాలువ
వరదకాలువ ఏడాదిపాటు జీవనదిలా పారుతోంది. 122 కిలోమీటర్ల పొడవునా తన చుట్టూ ప్రాంతాల్లోని పొలాలకు జీవం పోస్తుంది. - వివరాలు 8లో

గరిష్టం/కనిష్టం
42.0/28.0

వాతావరణం
ఎండగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. తీవ్ర వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

23న విదేశాల్లో ఉద్యోగాల కోసం జాబ్‌మేళా

సిరిసిల్లకల్చరల్: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో విదేశాల్లో ఉద్యోగావకాశాల కల్పనకు ఈనెల 23న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి నీల రాఘవేందర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జర్మనీ, ఆస్ట్రేలియా, పోలాండ్, మలేషియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి దేశాల్లో పలు ఉద్యోగాలను ఈ మేళా ద్వారా భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. జర్మనీలో నర్సింగ్, జీఎన్‌ఎం అర్హత కలిగిన 25–30 ఏళ్లలోపు యువత, యూఏఈలో బ్లాస్టర్ పెయింటర్, క్లీనర్, హెల్పర్, ఫోర్‌మ్యాన్, పెయింటింగ్ ఫోర్‌మెన్, ఫిట్టర్, వెల్డర్, ఐటీఐ డ్రైవర్, మెషనిస్ట్, పైప్‌ఫిట్టర్, ఫిట్టర్ ఫ్యాబ్రికేటర్ ఉద్యోగాలు, ఆస్ట్రేలియాలో సీఎన్‌సీ మెషనిస్టు, జర్మనీలో నాన్ హెల్తికేర్ యూనిట్‌లో మీట్ ప్రాసెసింగ్, ఫుడ్ రిటేల్ సేల్స్, ఛెఫ్స్టప్రాడ్, వేర్‌హౌస్ వర్కర్, ట్రక్ డ్రైవర్, ఫిట్టర్, టర్నర్ వంటి ఉద్యోగాలకు 22 నుంచి 28 ఏళ్లలోపు యువకులు, పోలాండ్‌లో వెల్డర్, ఫిట్టర్, మలేషియాలో టెక్నికల్ సూపరింటెండెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హతలు గల నిరుద్యోగులు కరీంనగర్‌లో ఉజ్వలపార్క్ సమీపంలో ఉన్న ఐటీ టవర్స్‌లోని టాస్క్ రీజనల్ సెంటర్‌లో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 78935 66493, 99519 09863లలో సంప్రదించాలని కోరారు.

‘మమ్మల్ని రోడ్డున పడేస్తారా’



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న సుంకరి ఇస్మాదారులు

సిరిసిల్లటౌన్: కేబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న నిర్ణయంతో రాష్ట్రంలోని నాలుగు లక్షల కుటుంబాలు రోడ్డున పడతాయని సుంకరి ఇస్మాదారులు ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్‌ఏలను రెగ్యులరైజ్ చేసే అంశంపై ప్రభుత్వం నిర్ణయం వెనక్కు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ కొన్నేళ్లుగా సుంకరులు వెట్టిబందీ ద్వారా విధులు నిర్వహిస్తున్నామన్నారు. ఇంటికి పెద్దను పట్వారీ నియమించి సంవత్సరానికి ఒకరు చొప్పున విధులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కానీ సీఎం హామీతో పట్వారీలకు మాత్రమే పట్టం కట్టి నాలుగు లక్షల కుటుంబాలను బజారున పడేస్తారా..అంటూ ప్రశ్నించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. సుంకరి ఇస్మాదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నక్క వర్మయాలు, నీరటి శ్రీనివాస్, తిరుపతి, రమేశ్, తోట ధర్మేందర్ పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో పోలీసుల తనిఖీలు



రాజన్న ఆలయ ప్రాంగణంలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

వేములవాడ: దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ రాజన్న ఆలయంలో భద్రతపై జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఆలయ ప్రాంగణంలో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టడంతో స్థానికుల్లో కొంత ఆందోళన రేకెత్తించింది. సుమారు మూడు గంటలపాటు ఆలయ పరిసరాలను తనిఖీ చేశారు.

ప్రభుత్వాస్పత్రిలో ఒకే రోజు పది కాన్పులు



చిన్నారులతో డాక్టర్ మహేశ్వరావు

వేములవాడఅర్బన్: వేములవాడ ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం ఒకే రోజు 10 కాన్పులు చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రేగులపాటి మహేశ్వరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ఒకే రోజు పది కాన్పులు చేశామన్నారు. ఇందులో ఆరు సాధారణ కాన్పులు కాగా, నాలుగు ఆపరేషన్ల ద్వారా చేసినట్లు వివరించారు. సాధారణ కాన్పులో ఆడబిడ్డకు జన్మనిచ్చిన వారికి ఉయ్యాలను బహుమతిగా అందజేసినట్లు తెలిపారు. వైద్యులు రైతన్నరుచూ, తిరుపతి, సంతోష్‌రాణి ఉన్నారు.

‘ఆమ్‌చూర్’పైనే ఆశలు

- మామిడి టంకరకు మంచి ధర
- అకాల వర్షాలతో నష్టాలు
- టంకరగా మారుస్తున్న వ్యాపారులు
- నిజామాబాద్, హైదరాబాద్‌లలో మార్కెట్లు
- క్వింటాలుకు రూ.14వేల నుంచి రూ.18వేలు
- రూ.20 వేలు ఉండాలంటున్న వ్యాపారులు



కోనరావుపేట శివారుల్లో మామిడి కాయల పొట్టుతీస్తూ ఆమ్‌చూర్ తయారు చేస్తున్న మహిళలు



మామిడి కాయలను పొట్టు తీసి, కోసి ముక్కలను ఎండపై ఆరబోస్తున్న ఈమె పేరు యామ అమృత. కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన అమృత మండలంలోని నిజామాబాద్‌కు చెందిన మామిడితోటను రూ.1.50 లక్షలకు గుత్త పట్టుకుంది. కంటికి రెప్పలా మామిడి కాయలను కాపాడుకోగా.. ఐదేవల అకాల వర్షాలు, ఈదురుగాలులకు కాయలన్నీ నేలరాలాయి. ఒకేసారి ఎక్కువ కాయలు రాలడంతో మార్కెట్‌లో ధర లేక ఇలా మామిడి టంకర(ఆమ్‌చూర్)గా మార్చుతుంది. ఇప్పుడు అమృత ఆశలన్నీ ఆమ్‌చూర్‌పైనే ఉన్నాయి.

సిరిసిల్ల: జిల్లాలో మామిడితోట రైతులు, తోటలను గుత్త(లీజు)కు తీసుకున్న వ్యాపారులు ఆమ్‌చూర్‌పైనే ఆశలు పెట్టుకున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు భారీస్థాయిలో మామిడి కాయలు రాలిపోవడంతో మార్కెట్‌లో ధర పడిపోయింది. దీంతో జిల్లాలోనే అత్యధిక సంఖ్యలో మామిడిరైతులు ఆమ్‌చూర్(టంకర) చేస్తున్నారు. ఐదేవల కురిసిన వర్షాలకు జరిగిన నష్టాన్ని ఆమ్‌చూర్ ద్వారా గట్టెక్కాలని చూస్తున్నారు. మార్కెట్ ఆమ్‌చూర్ అత్యధికంగా వస్తుండడంతో వ్యాపారులు ధరలు తగ్గిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాల్ ఆమ్‌చూర్‌కు రూ.16వేల నుంచి రూ.18వేలు పలుకుతోంది. క్వింటాల్‌కు కనీసం రూ.20 వేలు ఉంటే లాభం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

ఆమ్‌చూర్ తయారీ

జిల్లాలో ముస్తాబాద్, కోనరావుపేట, తంగళ్లపల్లి, చందుర్తి, వేములవాడ, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, ఇల్లంతకుంట, గంభీరావుపేట, బోయినపల్లి మండలాల్లో మామిడి తోటలు ఉన్నాయి. తోటల వద్దనే ఆమ్‌చూర్ తయారీ చేస్తున్నారు. మామిడికాయల పొట్టు తొలగించి ముక్కలుముక్కలుగా కోసి ఎండబెడతారు. కాయల నుంచి పిక్కను వేరు చేసి బాగా ఎండేవరకు ఆరబెట్టి నిల్వచేస్తారు. ఈ ఆమ్‌చూర్‌ను ఏజెన్సీలో వంటలో వినియోగించుకుంటుంటారు. పుల్లటి మామిడికాయలను సేకరించి ఆమ్‌చూర్ తయారు చేస్తారు. ఈ ఆమ్‌చూర్‌ను నిజామాబాద్, హైదరాబాద్, వరంగల్ ప్రాంతాల్లో విక్రయిస్తుంటారు. ఆమ్‌చూర్‌కు ఢిల్లీ, ఉత్తరభారతదేశంలో డిమాండ్ ఎక్కువగా ఉంది.

తొక్కుపై జనం అనాసక్తి

మామిడితొక్కు(ఊరగాయ) పెట్టేందుకు జనం పెద్దగా ఆసక్తి చూపడం లేదు. పెరిగిన సరుకుల ధరలకు తోడు శ్రమ సైతం ఎక్కువగా ఉంటుండడంతో తొక్కు పెట్టేందుకు ముందుకురావడం లేదు. దీంతో మార్కెట్‌లో పుల్లని మామిడికాయలకు డిమాండ్ పడిపోయింది.

ధర నిర్ణయించేది దళారీ

ఆమ్‌చూర్ విక్రయాలకు నిజామాబాద్ లేదా హైదరాబాద్‌లో మార్కెట్‌లు ఉన్నాయి. ఆయా మార్కెట్‌లలో మహారాష్ట్ర వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధరలు నిర్ణయిస్తున్నారని ఆమ్‌చూర్ వ్యాపారులు వాపోతున్నారు. గతేడాది క్వింటాల్ ఆమ్‌చూర్‌కు రూ.12వేలు ఉండగా.. ఈసారి రూ.14 వేల నుంచి రూ.18 వేల పలుకుతుంది. కనీసం క్వింటాలుకు రూ.20వేలు ఉంటే గిట్టుబాటవుతుందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

ధర ఉంటేనే గిట్టుబాటు



మామిడి టంకరకు నిజామాబాద్ మార్కెట్‌లో ధర ఉంటేనే మాకేమన్న లాభం. రెండు నెలలు రెక్కలు కాడ్చుకుని కాయలను కోసి కష్టపడతాం. ఇటీవల కురిసిన పిదాలు రాత్రికి రాత్రే కాయలన్నీ కిందరాలిపోయాయి. పిక్క కట్టక ముందే కొన్ని కాయలు రాలిపోయాయి. ఈసారి ఏం లాభం లేదు. ఇప్పుడు టంకర తయారీకి కూలీ రేట్లు పెరిగాయి. ధర వస్తేనే ఏమన్న లాభం. - చిట్టవేణి రమేశ్, కోనరావుపేట

డంపింగ్‌యార్డు పనులు పూర్తి చేయండి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

వేములవాడఅర్బన్: వేములవాడ మండలంలోని అగ్రహారంలోని వేములవాడ మున్సిపల్ డంపింగ్ యార్డు పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, మున్సిపల్ కమిషనర్ అన్వేశ్‌తో కలిసి శుక్రవారం డంపింగ్‌యార్డు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డంపింగ్‌యార్డులోని కంపోస్టు యార్డు, మల వ్యర్థాల నిర్వహణ కేంద్రం, వర్మికంపోస్టు, ఎఫ్‌ఎస్‌టీపీలను పరిశీలించారు. ఇప్పటికే మెజార్టీ పనులు పూర్తయినందున షట్టర్, కిటికీల గ్రిల్స్ త్వరగా పూర్తి చేసి, అందుబాటులోకి తేవాలని సూచించారు. మల వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని సిరిసిల్ల మాదిరిగా నిర్వహించేలా ప్లాన్ చేయాలని సూచించారు. కంపోస్ట్‌యార్డు నిర్వహణను స్వయం సహాయక సంఘాల సభ్యులకు అప్పగించాలన్నారు. డీఈఈ తిరుపతి, ఏఈ నరసింహ తదితరులు ఉన్నారు.

కంటి వెలుగులో 4,007 మందికి పరీక్షలు

సిరిసిల్ల: జిల్లాలో కంటి వెలుగు–2లో శుక్రవారం 4,007 మందికి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 536 మందికి రీడింగ్ అద్దాలు, 504 మందికి ప్రిస్కిప్షన్ అద్దాలను అందించారు. జిల్లా వ్యాప్తంగా 26 ప్రాంతాల్లో 234 మంది వైద్యసిబ్బంది పాల్గొన్నారు. 79 రోజులుగా 2,98,735 మందికి కంటి పరీక్షలు చేసినట్లు జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు తెలిపారు.

‘పెద్ద’ ఇబ్బందేమీ కాదు

- రూ.2వేల నోట్ల రద్దుతో సామాన్యులకు నష్టం లేదంటున్న జనం



సిరిసిల్లటౌన్: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంచలన నిర్ణయం తీసుకుంది. రూ.2000 నోట్లను రద్దు చేస్తూ శుక్రవారం నిర్ణయం తీసుకుంది. ఈనెల 23 నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు బ్యాంకులలో ఆ నోట్లను మార్చిడి చేసుకోవచ్చు. 2016, నవంబర్ 8వ తేదీన ప్రధాని మోడీ రూ.500, రూ.1000 నోట్లు రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయం తర్వాత రూ.2000 నోటును ఆర్‌బీఐ ప్రవేశపెట్టింది. మార్కెట్‌లో ఆ నోట్లు తక్కువగా చెలామణి అవుతుండడంతో ఆర్‌బీఐ ఈమేరకు నిర్ణయం తీసుకుంది. సరిగ్గా ఏడేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నోట్ల రద్దు నిర్ణయంతో సామాన్యులు చాలా ఇబ్బందులు పడ్డారు. పలువురు మహిళలు దాచుకున్న నోట్లను మార్చిడి చేసుకోవాలనే విషయం తెలియక ఇబ్బంది పడిపోయింది. రూ.2వేల నోట్ల రద్దుతో రాజన్నసిరిసిల్ల జిల్లా ప్రజలపై పెద్దగా ఇబ్బందేమీ ఉండదని జనం అభిప్రాయపడుతున్నారు. మార్పిడి విషయంలో అవగాహన కల్పించాలంటున్నారు.

‘డిజిటల్’తో ఇబ్బందులు తక్కువ



ఓపెన్ మార్కెట్లో రూ.2000 నోట్ల చలామణి తక్కువైంది. సంపన్నులు, ప్రభుత్వానికి పన్నులు ఎగవేసేవారు వద్దనే చిక్కిపోయాయి. సెప్టెంబర్ 30 వరకు పెద్దనోట్లు మార్చుకునే అవకాశం ఉండి కాబట్టి సామాన్యులకు ఇబ్బందులు తక్కువే. దరలపై ప్రభావం చూపే అవకాశాలు తక్కువ. - జిందం రమేశ్, చార్టర్డ్ అకౌంటెంట్

సంపన్నులకు పరీక్షే



పెద్దనోట్ల రద్దుతో బ్లాక్‌మనీపై ప్రభావం చూపెట్టడం ఖాయం. కానీ బ్యాంకుల్లో మార్చుకోవడం సంపన్నులతోపాటు సామాన్యులకూ పరీక్షే. ఈ నిర్ణయంతో అన్నివర్గాల ప్రజలు ఆందోళనకు గురవుతారు. మరో ఆరు నెలలు పెద్దనోట్లను మార్చుకునేలా చర్యలు తీసుకోవాలి. - చింతోజు భాస్కర్, వ్యాపారి

విఫల ప్రయోగమే



బ్లాక్‌మనీకి అడ్డుకట్ట వేయడానికి 2016లో కేంద్ర సర్కారు తీసుకున్న నిర్ణయం మంచిదే అయినప్పటికీ రూ.2000 నోట్లను ప్రవేశపెట్టడం విఫల ప్రయత్నం. వీటిని మార్కెట్లోకి తేవడంతో అక్రమార్కులు మరింత ధనాన్ని బ్లాక్ చేసే అవకాశాలు కల్పించినట్లు అయ్యింది. పెద్ద నోట్ల రద్దు ఫలాలు ప్రజలకు అందించాలి. - శ్రీనివాస్‌రావు, ప్రభుత్వ టీచర్

నెరవేరిన ‘సహకార’ ఉద్యోగుల కల

- జీవో 44 ఉత్తర్వులు అమలు
- జిల్లా వ్యాప్తంగా 600 మందికి ప్రయోజనం



సహకార ఉద్యోగులకు ఉద్యోగ భద్రత పత్రాలు అందిస్తున్న రవీందర్‌రావు

గంభీరావుపేట(సిరిసిల్ల): సహకార ఉద్యోగుల దశాబ్దాల కల నెరవేరింది. రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 44 ప్రకారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందికి ఉద్యోగ భద్రత లభించింది. రాష్ట్రవ్యాప్తంగా 4 వేల మందికి ప్రయోజనం చేకూరగా.. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వివిధ సహకార సంఘాల్లో పనిచేస్తున్న దాదాపు 600 మందికి ఉద్యోగ భద్రత లభించింది. దీంతో ఉద్యోగులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర సహకార బ్యాంకు చైర్మన్ కొండూరు రవీందర్‌రావు ఉద్యోగులకు, సిబ్బందికి ఉద్యోగ భద్రత పత్రాలను అందిస్తున్నారు. ఇన్నాళ్లు సహకార సంఘాల అధ్యక్షుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయడంతో వారిలో హర్షం వ్యక్తమవుతుంది. ఆదేవిధంగా సహకార సంఘాల అధ్యక్షులకు ఇచ్చే గౌరవ వేతనాన్ని సైతం పెంచింది.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



సహకార సంఘాల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న మా శ్రమను గుర్తించి ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించడం ఆనందంగా ఉంది. మా సంఘంలో 8 మందికి ఉద్యోగ భద్రత లభించింది. ఉద్యోగ భద్రత కోసం కృషి చేసిన టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు. - రాజిరెడ్డి, సీఈవో, గంభీరావుపేట సహకార సంఘం

మెరుగైన సేవలందించాలి



ఉద్యోగ భద్రత పొందిన ఉద్యోగులు, సిబ్బందిపై బాధ్యత పెరిగింది. రైతులకు, వినియోగదారులకు మెరుగైన సేవలందించాలి. కొట్లాడి సాధించుకున్న రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చుకుందామన్న సీఎం కేసీఆర్ మాటలకు... సహకార ఉద్యోగులను, సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించడమే నిదర్శనం. రాష్ట్రవ్యాప్తంగా 4వేల మందికి, కేడీసీసీ పరిధిలో 600 మందికి ఉద్యోగ భద్రత లభించింది. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు. - కొండూరు రవీందర్‌రావు, టెస్కాబ్ చైర్మన్

మత విద్వేషాలు రెచ్చగొడితే సహించం

సిరిసిల్లటౌన్: కమ్యూనిస్టు అగ్రనేత, బడుగువర్గాల ఆశాజ్యోతి పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో ప్రజాఉద్యమాలు చేపడతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు పేర్కొన్నారు. సిరిసిల్లలోని నెహ్రూనగర్ ఆర్‌ఎండీ భవనంలో శుక్రవారం పుచ్చలపల్లి వర్ధంతి సందర్భంగా ఆయన జీవితం, రాజకీయ నైతిక విలువలపై సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ బీజేపీ సర్కారు మత విద్వేషాలు రెచ్చగొడితే సహించబోమని హెచ్చరించారు. మూశం రమేశ్, ఎల్లారెడ్డి, రమణ, నాగరాజు, విమల, అరుణ్‌కుమార్, గణేశ్ పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న సీపీఎం నేతలు

టీచర్ శిక్షణ..నిధుల భక్షణ!

- సంగీతం, టైలరింగ్, చిత్రలేఖనంలో తర్ఫీదు
- ఉపాధ్యాయ పోస్టుల భర్తీ నోటిఫికేషన్‌తో పెరిగిన డిమాండ్
- కోర్సుకు అవసరానికి మించి సిబ్బందిని నియమించారని ఆరోపణలు
- ఏటా ఒకే బృందంతో ట్రైనింగ్ ఇస్తున్నారని ఫిర్యాదులు



శిక్షణ పొందుతున్న అభ్యర్థులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ కోర్సు (టీటీసీ) ఉపాధ్యాయ వృత్తిలో రాణించాలనుకునే వారికి వరంలాంటిది. హైదరాబాద్, నల్లగొండ, కరీంనగర్, నిజామాబాద్, వరంగల్(హన్మకొండ) ఉమ్మడి జిల్లాల్లో మాత్రమే అందుబాటులో ఉన్న కోర్సు ఇది. ఐదేవల ప్రారంభమైన టీటీసీ–2023 బ్యాచ్‌లో వందలాదిమంది అభ్యర్థులు చేరారు. సంప్రదాయ ఉపాధ్యాయ శిక్షణతోపాటు సంగీతం, టైలరింగ్, చిత్రలేఖనం వంటి కోర్సుల్లో నూ ఇక్కడ నైపుణ్యాలు నేర్పిస్తారు. కరీంనగర్‌లోని శిక్షణ కేంద్రంలో 500 మందికి పైగా అభ్యర్థులు శిక్షణ పొందుతుండగా.. అవసరానికి మించిన ఉపాధ్యాయులు, సిబ్బంది ఇక్కడ పనిచేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ ఉపాధ్యాయ సంఘం నాయకుడు తనకు దగ్గరున్న వారికే శిక్షణ విధులు కేటాయించేలా చక్రం తిప్పాడని, దీని వెనక లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ కుంభకోణం దాగి ఉందని ఆరోపిస్తున్నారు.

ఎక్కడ నేర్పిస్తున్నారు?

ఈ కోర్సులో టీచింగ్ కెరీర్‌గా ఎంచుకునే వారందరికీ ఉపయుక్తంగా ఉంటుంది. బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ (టీబీఎస్‌ఈ) ఆధ్వర్యంలో ఈ టీటీసీసీ–2023 (టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ కోర్సు)కు 42 రోజులు శిక్షణ ఇవ్వనున్నారు. మే ఒకటో తేదీ నుంచి జూన్ 11వరకు కరీంనగర్ జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ దంగెగ్‌వాడీ పాఠశాల వేదికగా మంకమ్మతోటలో నిర్వహిస్తున్నారు. కుట్లు, చిత్రలేఖనం, సంగీతంలో శిక్షణ ఇస్తున్నారు. టైలరింగ్‌లో 246 మంది, డ్రాయింగ్ 293 మంది, మ్యూజిక్ 14 మంది మొత్తం 553 మంది శిక్షణ పొందుతున్నారు. పదో తరగతి లేదా లోయర్ గ్రేడ్ ఉత్తీర్ణత ఉండి 18 నుంచి 45 ఏళ్లలోపు వయసు కలిగి ఉన్నవారు కోర్సుల్లో చేరొచ్చు. కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలతోపాటు ఆసిఫాబాద్, గజ్వేల్, చెన్నూరు, గోదావరిఖని, మంథని, ఆదిలాబాద్, సిద్దిపేట, మంచిర్యాల, జగిత్యాల, వరంగల్ నుంచి అభ్యర్థులు శిక్షణ పొందుతున్నారు. 2016, 2017, 2018 బ్యాచులకు చెందిన విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు.

సిబ్బందిని ఎక్కువయ్యారని ఆరోపణలు

ఈ కోర్సులో శిక్షణ ఇచ్చేందుకు అవసరానికి మించి ప్రభుత్వ టీచర్లకు విధులు కేటాయించారని, ఇందులో లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ చేసుకునే కుట్ర ఉందని పలువురు సీనియర్ ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. తొలుత కోర్సు బోధనకు 22 మందిని తీసుకున్నారు. బోధన సిబ్బందిని పీజీ, ఎంఈడీ అర్హత ప్రకారం తీసుకోవాలి. ఈ అర్హతలు లేకున్నా.. కొందరిని ఎంపిక చేయడం వివాదాస్పదంగా మారింది. వెంటనే నాలిక కరుచుకున్న అధికారులు తొమ్మిదిమందిని తప్పించారు. ప్రస్తుతం డైట్ కాలేజీలో పనిచేసిన 13 మంది ఉపాధ్యాయులతో బోధిస్తున్నారు. ప్రాక్టికల్స్ నిర్వహణకు మరో ఐదుగురు, డ్రాయింగ్ కోసం ఆరుగురు, టైలరింగ్ కోసం ఒకరు, మ్యూజిక్ టీచర్, బిల్డింగ్ ఇన్‌చార్జి, కంప్యూటర్ ఆపరేటర్లు, ఆఫీస్ వర్క్ కోసం ఎనిమిదిమంది, ఐదుగురు పీఈటీలు, ఆరుగురు అటెండర్లు ఉన్నారు. ఒక కోర్సు డైరెక్టర్, కోర్సు కో–ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు.

ఎవరా నేత?

గతంలో కోర్సు నిర్వహణకు ఇంతమంది సిబ్బంది లేరని, ఇప్పుడు అవసరానికి మించి కేటాయించడం వెనక ఉద్దేశం ఏంటని తోటి ప్రభుత్వ ఉపాధ్యాయులే నిలదీస్తున్నారు. ప్రతీసారి ఈ సిబ్బంది ఎంపికలో ఓ ఉపాధ్యాయ సంఘం నేత చక్రం తిప్పుతున్నాడని, ఆయన ఏటా తన మనుషులుగా ముద్రపడ్డ వారికే డ్యూటీలు వేయిస్తున్నాడని మండిపడుతున్నారు. పీఈటీలు, ఆఫీస్ సబార్డినేటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు అవసరానికి మించి ఉన్నారని, దీని వెనక లీవ్‌ఎన్‌క్యాష్‌మెంట్ కుంభకోణం దాగి ఉందని ఆరోపిస్తున్నారు. అక్కడున్న, బిల్డింగ్ ఇన్‌చార్జులుగా ఉపాధ్యాయులుగా వ్యవహరిస్తుండటమే ఇందుకు నిదర్శనమని ఆరోపిస్తున్నారు. డీఈవో, డైట్, డీసీఈబీలలో నాన్ టీచింగ్‌స్టాఫ్‌ని సద్వినియోగం చేసుకోకుండా ఉపాధ్యాయులను ఆ పోస్టులో ఎలా నియమిస్తారని, అభ్యర్థుల సంఖ్య పెరగనప్పుడు అదనపు సిబ్బంది దేనికోసమని ప్రశ్నిస్తున్నారు. దీనిపై కోర్సు కో ఆర్డినేటర్ లక్ష్మారెడ్డిని వివరణ కోరగా.. అభ్యర్థుల నిష్పత్తిగా తగినట్లుగానే సిబ్బంది కేటాయింపు జరిగిందని, అదనంగా ఎవరూ లేరని సమాధానం ఇచ్చారు.

జీవనదిలా వరదకాలువ

- ఏడాది పొడవునా నీటి ప్రవాహం
- రెండు సీజన్లలో రైతులకు కలిసొస్తున్న కాలువ నీరు
- ఎస్సారెస్పీ నుంచి 122 కి.మీ పొడవు
- నాలుగు జిల్లాలో 1.20 లక్షల ఎకరాల్లో వరిసాగు



బోయినపల్లి మండలం మీదుగా పారుతున్న వరదకాలువ

బోయినపల్లి(చొప్పదండి): భగభగ మండే ఎండలు ఒక వైపు.. నిండుకుండలా ప్రవహిస్తున్న వరద కాలువ మరో వైపు. ఏడాదిలో 365 రోజులు వరద కాలువ జీవనదిలా నిండుగా ప్రవహిస్తోంది. నిజామాబాద్ జిల్లా బాల్కొండ ఎస్సారెస్పీ నుంచి జగిత్యాల, కరీంనగర్ జిల్లాల మీదుగా రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం వరదవెల్లి క్రాస్ రెగ్యులేటరీ వరకు 122 కిలోమీటర్ల మేర వరద కాలువ విస్తరించి ఉంది. నాలుగు జిల్లాల పరిధిలో కాలువ పరిసరాల్లోని పొలాల్లో పచ్చని పంటలు కనులపండువగా కనిపిస్తుంది. వరద కాలువ నీటితో గత రబీ సీజన్‌లో వరిసాగు భారీగా పెరిగింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సుమారు 70 వేలకు పైగా ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. జగిత్యాల జిల్లాలో వరదకాలువ ఆధారంగా అత్యధికంగా సుమారు 50 వేల ఎకరాల్లో రైతులు రబీలో వరి పంట వేశారు.

ఐదు డివిజన్లు

నిజామాబాద్ జిల్లాలో ప్రారంభమై 122 కిలోమీటర్ల మేర విస్తరించిన వరద కాలువను ఐదు డివిజన్లుగా విభజించారు. ఎస్సారెస్పీ జీరో పాయింట్ నుంచి 28 కి.మీ వరకు ఒక డివిజన్, 28 కి.మీ నుంచి 44 కి.మీ వరకు రెండో డివిజన్, 44 కి.మీ నుంచి 73 కి.మీ వరకు మూడో డివిజన్, 73 కి.మీ నుంచి 102 కి.మీ వరకు నాలుగో డివిజన్, 102 కి.మీ నుంచి 122 కి.మీ వరకు ఐదో డివిజన్‌లుగా ఏర్పాటు చేశారు. ఐదు డివజన్ల పరిధిలో వరద కాలువను ఐదుగురు ఈఈలు, ఇద్దరు ఎస్ఈలు పర్యవేక్షిస్తారు.

నాలుగు జిల్లాలు.. 1.20 లక్షల ఎకరాలు

నిజామాబాద్ జిల్లా బాల్కొండ ఎస్సారెస్పీ జీరో పాయింట్ నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా వరదవెల్లి క్రాస్ రెగ్యులేటర్ వరకు 122 కిలోమీటర్‌లు వరద కాలువ నిర్మించారు. ఈ కాలువలో నీరు సుమారు 18 మీటర్ల లోతు ఉంటుంది. అడుగు భాగాన 43 మీటర్ల వెడల్పు ఉంటుంది. వరదకాలువలో నిల్వ ఉన్న నీరు ఆధారంగా మోటార్లతో నిజామాబాద్ జిల్లాతోపాటు ఉమ్మడి కరీంనగర్‌లోని జగిత్యాల, కరీంనగర్, రాజన్నసిరిసిల్ల జిల్లా పరిధిలో రెండు సీజన్లలో సుమారు 1.20 లక్షల ఎకరాల మేర పంటలు సాగవుతున్నాయి. జగిత్యాల జిల్లాలో ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, కథలాపూర్, కోరుట్ల, మేడిపెల్లి మల్యాల మండలాల్లో సుమారు 50 వేల ఎకరాల్లో, కరీంనగర్ జిల్లా పరిధిలోని గంగాధర, రామడుగు మండలాల్లో సుమారు 10 వేల ఎకరాల్లో, రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలో ఏడు వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు

వరదకాలువ స్వరూపం

- పొడవు : 122 కిలోమీటర్లు
- విస్తరించి ఉన్న జిల్లాలు: నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల
- డివిజన్లు : 05
- పర్యవేక్షణాధికారులు : ఇద్దరు ఎస్ఈలు, నలుగురు ఈఈలు
- వరదకాలువలో నిల్వ ఉన్న నీరు : ముప్పావు టీఎంసీ

పెరిగిన భూగర్భజలాలు

గత రెండేళ్లుగా ఏడాది పొడవున సుమారు ముప్పావు టీఎంసీ మేర వరదకాలువలో నీరు నిల్వ ఉండడంతో కాలువ పరిసరాల్లో భూగర్భ జలాలు భారీగా పెరిగాయి. మొత్తం వరద కాలువ కింద 34 తూములు 70 చెరువులు ఉన్నాయి. 34 తూముల ద్వారా 70 చెరువులు నింపుతున్నామని వరదకాల్వ 70 కి.మీ ఈఈ సుధాకిరణ్ చెప్పారు. ఇలా చెరువు, కాల్వ పరిసరాల్లో ఆరు కిలోమీటర్ల మేర బావుల్లో ఊటలు భారీగా పెరుగుతున్నాయని తెలిపారు.

వేసవిలో పది గజాల మేర నీరు



దేశాయిపల్లి వరదకాలువ పరిసరాల్లో మూడు ఎకరాల మేర వ్యవసాయ భూమి ఉంది. కాలువ పరిసరాల్లో గతంలో 20 గజాల మేర బావి తవ్వాము. బావిలో ఇప్పుడు ఎండాకాలంలో సైతం పది గజాల మేర నీటి ఊటలు ఉన్నాయి. మూడెకరాల్లో వానాకాలం, యాసంగి రెండు సీజన్లలో వరి పంటలు వేస్తాం.

– నిమ్మ వినోద్‌రెడ్డి, దేశాయిపల్లి (బోయినపల్లి)

రైతుల వరప్రదాయిని..



వరదకాలువ రైతులకు వరప్రదాయినిగా మారింది. వరదకాలువలో ఏడాది పొడవున 365 రోజులు సుమారు టీఎంసీ మేర నీరు నిల్వ ఉండేలా చేసేందుకు సీఎం కేసీఆర్ ఎంతో శ్రద్ధ తీసుకున్నారు. ఈ ప్రాంత రైతులు కాలువ ఆధారంగా రెండు పంటలు వేస్తున్నారు. భూగర్భజలాలు సైతం భారీగా పెరుగుతున్నాయి.

– జోగినిపల్లి రవీందర్‌రావు, రాష్ట్ర నాయకుడు

ముప్పావు టీఎంసీ నీరు



నిజామాబాద్ ఎస్సారెస్పీ వరదకాలువ జీరో పాయింట్ నుంచి బోయినపల్లి మండలం వరదవెల్లి క్రాస్‌రెగ్యులేటర్ వరకు 122 కిలోమీటర్‌ల వరకు వరదకాలువ విస్తరించి ఉంది. ఏడాది పొడవునా 365 రోజులు వరదకాలువలో ముప్పావు టీఎంసీ మేర నీరు నిల్వ ఉంటుంది. వరదకాలువలో ఉన్న నీటితో పరిసరాల్లో భూ గర్భజలాలు భారీగా పెరిగాయి.

– అశోక్‌కుమార్, వరదకాలువ, ఎస్ఈ, జగిత్యాల

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న లక్ష్మణ్

సిరిసిల్లఅర్బన్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్ కోరారు. పట్టణంలోని కార్మిక భవన్‌లో శుక్రవారం మాట్లాడారు. చాలీచాలని జీతాలతో ఏళ్లుగా పనిచేస్తున్న తమకు కనీస వేతనం చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేసి, రూ.10లక్షల బీమా వర్తింపజేయాలని కోరారు. ఎల్లవ్వ, లక్ష్మి, ఇల్లందుల ఎల్లవ్వ, నడికొట్టు లక్ష్మి, రాజేశ్వరి ఉన్నారు.

స్వయం ఉపాధిమార్గాలు పెంచుకోవాలి



కుట్టు మిషన్, బ్యుటీషియన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రుద్రంగి ఎంపీపీ, జెడ్పీటీసీ

రుద్రంగి(వేములవాడ): ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువత స్వయం ఉపాధి మార్గాలు పెంపొందించుకోవాలని రుద్రంగి ఎంపీపీ గంగం స్వరూపారాణి, జెడ్పీటీసీ గట్ల మీనయ్య కోరారు. రుద్రంగిలోని జెడ్పీ హైస్కూల్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టుమిషన్, బ్యుటీషియన్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. రుద్రంగి సర్పంచ్ తర్రె ప్రభలత, అంగన్‌వాడీ టీచర్ అంబటి సరిత, శిక్షణ తరగతులకు వచ్చిన యువతులు, తదితరులు పాల్గొన్నారు.

లారీల కొరత లేకుండా చూడాలి



వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

సిరిసిల్లఅర్బన్: ధాన్యం కొనుగోలు కేంద్రాలలో లారీల కొరత లేకుండా చూడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ఆధ్వర్యంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి జితేందర్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. వేణు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెలరోజులు గడుస్తున్నా పూర్తి స్థాయి ధాన్యం కొనుగోలు చేపట్టలేదన్నారు. చేసేదేమీ లేక రైతులు తక్కువ ధరకే దళారులకు ధాన్యాన్ని అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో బస్తాకు రెండు రూపాయాలు ఇవ్వాలని లారీ యజమానులు డిమాండ్ చేస్తున్నారని దీన్ని అరికట్టాలని కోరారు. తరుగుతీస్తున్న రైస్‌మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పంతం రవి, మీసం లక్ష్మణ్, నాగరాజు, లక్ష్మణ్ ఉన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ప్రభుత్వ ఐటీఐలో మొదటి విడత అడ్మిషన్‌ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కనకయ్య ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో జూన్ 10లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు కనీసం 14 ఏళ్లు నిండి ఉండాలని మార్కులు, రిజర్వేషన్, స్థానికత ఆధారంగా సీట్లు కేటాయిస్తారని తెలిపారు. మండేపల్లి ప్రభుత్వ ఐటీఐలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మోటార్ మెకానిక్ వెహికిల్, వెల్డర్, మెకానిక్ డీజిల్ కోర్సులు ఉన్నాయని పేర్కొన్నారు.

సిరిసిల్లలో రేపు మ్యూజికల్ కన్సర్ట్



సిరిసిల్లలో మాట్లాడుతున్న మ్యూజికల్ కన్సర్ట్ నిర్వాహకులు

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల మినీస్టేడియంలో ఆదివారం సాయంత్రం మ్యూజికల్ ఈవెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం వివరాలు వెల్లడించారు. బీ4 మ్యూజికల్ కన్సర్ట్‌ను బీఫోర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. తెలుగు సినీ గాయనీ, గాయకులు, ఇన్ఫ్యూషనల్ బాండ్ ట్రూప్, డీజే రాష్ తమ పర్మార్మెన్స్‌తో అలరిస్తారన్నారు. బుక్‌మై షో ద్వారా టికెట్స్ పొందాలని కోరారు. నేరుగా టికెట్స్ కావాల్సిన వారు జిల్లా ఆసుపత్రి ముందు ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో, 79906 44141, 99893 32891, 99515 05057లలో సంప్రదించాలని కోరారు. నిర్వాహకులు జి.వర్మ, నవీన్‌కుమార్, కీర్తనరెడ్డి, విలాస్, కిరణ్, వంశీకృష్ణ, భాను ప్రకాష్, లవన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌కు కోతుల బెడద ఉండదు

- ఎంపీపీ పి.వేణుగోపాల్

బోయినపల్లి(వేములవాడ): ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు కోతుల బెడద ఉండదని, సాగుచేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ పేర్కొన్నారు. మండలంలోని కొదరుపాక రైతువేదిక భవనంలో ఆ క్లస్టర్ పరిధిలోని రైతులకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఆయిల్‌పామ్ సాగులో అంతర పంటలుగా మొక్కజొన్న, అరటి, పొద్దుతిరుగుడు, పెసలు, మినుములు తదితర పంటలు సాగు చేసుకోవచ్చని ఏఈవో రవళి తెలిపారు. ఆయిల్‌పామ్ సాగు చేసి లాభాలు పొందిన రైతులను సన్మానించారు. సెస్‌డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, ఏఎంసీ వైస్‌చైర్మన్ చిక్కాల సుధాకర్‌రావు, కొనుకటి లచ్చిరెడ్డి, పీయూనిక్ కంపెనీ ప్రతినిధులు, రైతులు ఉన్నారు.

నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం

- పీడీ యాక్టులు నమోదు చేస్తాం
- ఆల్ టైం తనిఖీలు నిర్వహిస్తాం
- ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లటౌన్: నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. జిల్లా పోలీస్ అధికారులతో వ్యవసాయశాఖ అధికారి భాస్కర్‌తో కలిసి నకిలీ విత్తనాలను అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం సమీక్షించారు. నకిలీ విత్తనాల తయారీదారులు, విక్రయదారులపై అవసరమైతే పీడియాక్టు నమోదు చేస్తామన్నారు. వ్యవసాయాధికారులతో కలిసి ఎప్పటికప్పుడు తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనేటప్పుడు సరిగ్గా చెక్ చేసుకోవాలని, రశీదులు తీసుకోవాలని సూచించారు. ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు విశ్వప్రసాద్, నాగేంద్రచారి, రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో దొంగల నుంచి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తూ పోలీస్‌శాఖ ముద్రించిన పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఊరెళ్లితే సంబంధిత పోలీస్‌స్టేషన్, వీపీవో, డబ్ల్యూపీవో కానిస్టేబుల్స్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలి

ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పోలీస్ అధికారులకు సూచించారు. అన్ని మండలాల పోలీస్ అధికారులతో సమావేశమై, మాట్లాడారు. నిందితులకు శిక్షల శాతం పెంచేలా కృషి చేయాలన్నారు. పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించాలని, అవసరమైతే న్యాయమూర్తులను స్వయంగా కలిసి కేసుల పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. గత నెలలో విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన అధికారులకు, సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందజేశారు. డీఎస్పీలు విశ్వప్రసాద్, నాగేంద్రచారి, రవికుమార్, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

పొరుగు జిల్లాలకు మన ధాన్యం

- కామారెడ్డి, కరీంనగర్‌కు తరలింపు
- జిల్లాలో 1,04,883 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- 8774 మంది రైతులకు రూ.86.90 కోట్ల చెల్లింపులు



ధాన్యం కొనుగోళ్లపై ఆరా తీస్తున్న కలెక్టర్

సిరిసిల్ల: జిల్లా రైతులు పండించిన పంటను పొరుగు జిల్లాలకు తరలిస్తున్నారు. జిల్లాలో బాయిల్డ్ రైస్‌మిల్లులు 30 ఉండగా.. ధాన్యం నిల్వకు స్థలం లేక పొరుగు జిల్లాలకు ఎగుమతి చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 257 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి 16,825 మంది రైతుల వద్ద 1,04,883 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇప్పటికే కొనుగోలు చేసిన ధాన్యం విలువ రూ.216.06 కోట్లు కాగా.. 8,774 మంది రైతులకు రూ.86.90 కోట్లు చెల్లించినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. జిల్లాలో మూడు సెక్టార్లలో 300 లారీలను ధాన్యం తరలింపునకు వినియోగిస్తున్నట్లు వివరించారు. లారీలను అన్‌లోడ్ చేయడంలో జాప్యమవుతుందని, ఎండ తీవ్రతతో హమాలీలు ఎక్కువ సేపు పనిచేసే పరిస్థితి లేక ధాన్యం అన్‌లోడింగ్‌లో ఆలస్యమవుతుందన్నారు. సెక్టారుకు వంద లారీల చొప్పున పంపుతున్నట్లు వివరించారు. కొన్ని ప్రాంతాల్లో స్థానికంగా ఉన్న ట్రాక్టర్లను సైతం ధాన్యం రవాణాకు వినియోగించుకుంటున్నారన్నారు. కొద్దిగా ఆలస్యమైన పూర్తి స్థాయిలో కొనుగోళ్లు చేస్తామని జితేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

ప్రత్యేక పారిశుధ్య పనులు

- 27 వరకు అన్ని వార్డుల్లో కొనసాగింపు
- మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్ వార్డుల సందర్శన



9వ వార్డులో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్‌లు

వేములవాడ: వేములవాడ మున్సిపల్ వార్డుల్లో ప్రత్యేక పారిశుధ్యం పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ పనులు ఈనెల 27 వరకు చేపట్టనున్నారు. పట్టణంలోని 9వ వార్డులో కొనసాగుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ అన్వేశ్‌తోపాటు చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి పరిశీలించారు. చైర్‌పర్సన్ మాధవి మాట్లాడుతూ రానున్న వానాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకే చెత్తాచెదరాన్ని తొలగించడంతోపాటు వీధుల్లో ఉన్న పిచ్చిమొక్కలను తొలగిస్తున్నట్లు చెప్పారు. పట్టణంలో శిథిలావస్థలో ఉన్న 70 ఇళ్లను మున్సిపల్ వార్డు అధికారులు గుర్తించి, వారికి నోటీసులు అందించారని తెలిపారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, వార్డు అధికారి మురళి, జవాన్ మహేశ్, సిస్టమ్ మేనేజర్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

ప్రజలకు సేవలందించేందుకు పోలీసులు

- పోలీసు మీ కోసంలో ఎస్సై రమేశ్



ఎస్గల్‌లో 'పోలీసులు మీ కోసం'లో మాట్లాడుతున్న ఎస్సై రమేశ్

చందుర్తి(వేములవాడ): ప్రజలకు నిరంతరం సేవలందించేందుకు పోలీసులు సిద్ధంగా ఉంటారని చందుర్తి ఎస్సై రమేశ్ పేర్కొన్నారు. చందుర్తి మండలం ఎస్గల్‌లో శుక్రవారం రాత్రి పోలీసు మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సై రమేశ్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ, బ్యాంకు డిటేల్స్ అడిగితే చెప్పొద్దన్నారు. అపరిచిత వ్యక్తుల సమాచారాన్ని తెలపాలని కోరారు. సర్పంచ్ లింగంపల్లి సత్తయ్య,వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మండల ప్రజల ఏళ్ల నాటి కల నెరవేరుతుంది. స్థానిక ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు రుద్రంగిలో 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటు ప్రతిపాదనలు ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా గురువారం సీఎం ఆమోదం తెలిపారు. దీంతో మండల ప్రజలకు 30 పడకల ఆస్పత్రి సేవలు అందుబాటులోకి రానున్నాయి. సీఎం నిర్ణయంతో శుక్రవారం రుద్రంగిలో ఎంపీపీ గంగం స్వరూపారాణి, జెడ్పీటీసీ గట్ల మీనయ్య, పార్టీ నాయకులతో కలిసి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే రమేశ్‌బాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కంటిరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు దయ్యాల కమలాకర్, నాయకులు గంగం మహేశ్, పూదరి శ్రీనివాస్, మంచె రాజేశం పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయానికి రూ.1.50 కోట్లు

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య



పురాతన వేణుగోపాలస్వామి ఆలయం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సుప్రసిద్ధ శ్రీవేణుగోపాలస్వామి ఆలయ మరమ్మతు పనులకు టీటీడీ నుంచి రూ.1.50 కోట్లు మంజూరైనట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తెలిపారు. ఎల్లారెడ్డిపేటలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. శిథిలావస్థకు చేరిన ఆలయ పరిస్థితిపై మంత్రి కేటీఆర్‌కు వివరించగా.. టీటీడీ అధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించారన్నారు. ఆలయ మరమ్మతుకు రూ.3 కోట్ల వరకు అవసరం ఉండగా.. ప్రస్తుతం ఈ నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. మిగిలిన నిధుల కోసం మంత్రికి నివేదించినట్లు తెలిపారు. ఈ నెలాఖరులో టీటీడీ ఆలయ కమిటీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి కేటీఆర్, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా పనులను ప్రారంభిస్తామని తెలిపారు. నిధుల మంజూరుకు కృషిచేసిన మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వాస్పత్రుల్లోనే కాన్పులు జరపాలి

- డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు



మాట్లాడుతున్న సుమన్ మోహన్‌రావు

సిరిసిల్లటౌన్: జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు జరిగేలా సిబ్బంది పూర్తి బాధ్యతతో మెదలాలని డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు సూచించారు. సిరిసిల్లలోని తన కార్యాలయంలో శుక్రవారం పీహెచ్‌సీల పర్యవేక్షకులతో సమీక్షించారు. క్షయ నివారణపై నిర్లక్ష్యంగా ఉండొద్దని సూచించారు. 2025 వరకు క్షయ రహిత జిల్లాగా మార్చాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో బాలయ్య, వైద్యులు శ్రీరాములు, రజిత, మహేష్, నయీమా, శ్రీనివాస్, లింగం, బాలయ్య పాల్గొన్నారు.

రైతులకు పరిహారమేదీ?

- కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి



పార్టీలో చేరిన నాయకులతో మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వడగండ్ల వానలు, ఇతర కారణాలతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించడంలో ప్రభుత్వం మొండి చేయి చూపిందని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని కోరుట్లపేటలో శుక్రవారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. గూడాటి విజయ్‌రెడ్డి ఆధ్వర్యంలో 30 మంది రైతులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. రూ.లక్ష రుణ మాఫీ ఇప్పటికీ అమలు కాలేదన్నారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం రైతులకు క్వింటాల్‌కు రూ.2640 చెల్లించడమే కాకుండా సంవత్సరానికి రాజీవ్‌గాంధీ పథకం కింద రూ.10 వేలు ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తుందన్నారు. సీఎం కేసీఆర్ మాటలు తప్ప పనిచేయడం లేదని ఆరోపించారు. మంత్రి కేటీఆర్ నియోజకవర్గంలో మిల్లర్లు రైతుల వద్ద 10 కిలోల తూకాన్ని తరుగుకింద తీసుకుంటున్నారన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు గౌస్, లక్ష్మారెడ్డి, బుచ్చాగౌడ్, దేవయ్య, బాబు, రాజునాయక్, రాజు, రవీందర్, తిరుపతిరెడ్డి, పోచయ్య, మల్లారెడ్డి, పర్శ రాములు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి



దీక్షలో వార్డు సభ్యుడు రాములు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మేజర్ పంచాయతీలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వార్డు సభ్యుడు బుర్ర రాములు శుక్రవారం దీక్ష చేపట్టాడు. రాములుకు డీసీసీ ప్రధాన కార్యదర్శి పెద్దిగారి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ వోరగంటి తిరుపతి మద్దతు తెలిపారు. రాములు మాట్లాడుతూ ముస్తాబాద్ సర్పంచ్ సుమతి ఇటీవల చేపట్టిన నిర్మాణంలో సెట్‌బ్యాక్ పాటించలేదని ఆరోపించారు. ఈ విషయంలో అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. ఆదర్శంగా ఉండాల్సిన సర్పంచ్ అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. కలెక్టర్ విచారణ చేపట్టి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుని, పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలని కోరారు. పంచాయతీ ఆవరణలో దీక్షలు చేయవద్దని పోలీసులు రాములుకు సూచించారు. ఆందోళన విరమించాలని కోరారు.

అగ్రహారంలో దోస్త్ జిల్లా హెల్ప్‌లైన్ సెంటర్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

వేములవాడఅర్బన్: డిగ్రీలో దోస్త్ ద్వారా జిల్లా ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని, దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్‌ను వేములవాడ మండల అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్ తెలిపారు. డిగ్రీలో ప్రవేశం పొందే విద్యార్థులు ఫేస్–1లో ఈ నెల 16 నుంచి జూన్ 10 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈనెల 20 నుంచి జూన్ 11 వరకు వెబ్ ఆప్షన్ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. జూన్ 16న సీట్ల కేటాయింపు ఉంటుందని వివరించారు. ఫేస్–2లో రిజిస్ట్రేషన్, వెబ్ ఆప్షన్ల ప్రక్రియ జూన్ 16 నుంచి 27 వరకు, 30న సీట్ల కేటాయింపు ఉంటుందని వివరించారు. ఫేస్–3లో రిజిస్ట్రేషన్, వెబ్ ఆప్షన్ ప్రక్రియ జూలై 1 నుంచి 6 వరకు, సీట్ల కేటాయింపు జూలై 10న ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ఈ దోస్త్ జిల్లా సహాయక కేంద్రాన్ని సందర్శించి, సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు. వివరాలకు 89199 14978, 99511 91820లలో సంప్రదించాలని కోరారు.